సాక్షి
మంచిర్యాల
బుధవారం। 7। ఆగస్టు। 2024



క్రీడలకు మహర్దశ

రాష్ట్రంలో నూతన క్రీడా పాలసీని తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. దీంతో మారుమూల గ్రామాల దాకా క్రీడా వసతులు అందుబాటులోకి రానున్నాయి. 8లో▸



ఘనంగా జయశంకర్ జయంతి

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. తెలంగాణ ఉద్యమంలో సార్ పాత్రను అధికారులు, నాయకులు కొనియాడారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.0 /25.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

వైద్యం.. దైన్యం

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- సమస్యల్లో ప్రభుత్వ ఆస్పత్రులు
- సరిపడా లేని డాక్టర్లు, సిబ్బంది
- అందని అన్ని రకాల మందులు
- చేసేది కొన్ని రకాల వైద్యపరీక్షలే
- సామాన్యులకు అందని సేవలు
- 'సాక్షి' విజిట్‌లో సమస్యలు వెల్లడి



పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో క్యూలో రోగులు

సాక్షి విజిట్

సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రులను మంగళవారం 'సాక్షి' విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగుచూశాయి. ఆస్పత్రులకు వస్తున్నవారిలో అత్యధికులు జ్వరపీడితులే ఉన్నారు. వీరికి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తూ అందుబాటులో ఉన్న మందులు అందజేస్తున్నారు. పలు రకాల పరీక్షల కోసం శాంపిళ్లు సేకరించి సమీప పెద్దాస్పత్రులకు పంపించి సాయంత్రం లేదా మరుసటి రోజు రిపోర్టులు తెప్పిస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్‌టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్స్‌లు, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల మందుల కొరత ఉంది. చాలా ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో సేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపించింది.

కోటపల్లి ఆయుర్వేద వైద్యశాలకు తాళం



కోటపల్లి: తాళం వేసి ఉన్న ఆయుర్వేద వైద్యశాల

కోటపల్లి: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యురాలు లేక రోగులు ఇబ్బంది పడ్డారు. ఫార్మసిస్ట్ లేక సబ్‌సెంటర్ సిబ్బందిలో రోజుకొకరికి విధులు కేటాయిస్తున్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉండాల్సిన వైద్యసిబ్బందికి ఇక్కడ విధులు కేటాయించడంతో సబ్‌సెంటర్లకు వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. కోటపల్లి ఆయుర్వేద వైద్యశాల తాళం తీయలేదు. వైద్యులు, సిబ్బంది ఇటీవల బదిలీల్లో వెళ్లిపోగా ఇక్కడికి ఎవరినీ కేటాయించలేదు. ఆయుర్వేద ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

వేమనపల్లి పీహెచ్‌సీ నుంచి చెన్నూర్‌కు రెఫర్

వేమనపల్లి: వేమనపల్లి పీహెచ్‌సీలో సరిపడా సిబ్బంది లేరు. మంగళవారం 65మంది రోగులు వచ్చారు. పీహెచ్‌సీ పరిధిలో సాధారణ, టైఫాయిడ్ జ్వరాలు నమోదవుతున్నాయి. ఇద్దరు వైద్యులకు ఒక్క కోటపల్లి పీహెచ్‌సీ వైద్యుడు రాకేశ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. చామనపల్లి, నీల్వాయి ఏఎన్‌ఎంలు ముల్కలపేట హెల్త్ సూపర్‌వైజర్, నాలుగు స్టాఫ్‌నర్స్, మేల్ సూపర్‌వైజర్, రెండు ఆశ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రసూతి కోసం వస్తున్న మహిళలు చెన్నూర్‌కు వెళ్తున్నారు. జ్వర పీడితులు ఆర్‌ఎంపీల వద్దకు వెళ్తున్నారు.

కాసిపేటలో జ్వర బాధితులు తక్కువే..

కాసిపేట: కాసిపేట పీహెచ్‌సీకి వారం రోజుల్లో 594మంది మంది రాగా 62మంది జ్వరపీడితులే ఉన్నారు. ఇందులో 26మంది వైరల్ ఫీవర్‌తో బాధ పడుతున్నట్లు రిపోర్టులలో తెలిసింది. మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అత్యవసరమైతే ర్యాపిడ్ టెస్టులు చేస్తున్నారు. లేదంటే బ్లడ్ శాంపిళ్లు తీసి టీ హబ్‌కు పంపిస్తున్నారు. మండలంలో పెద్దగా జ్వరాలు లేవని వైద్యాధికారి దివ్య తెలిపారు.

అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీలో సిబ్బంది కొరత



చెన్నూర్‌రూరల్: అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీలో..

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీకి 70నుంచి 80 మంది రోగులు వచ్చారు. వీరికి వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు మామూలు జ్వరాలుగా నిర్ధారించారు. పీహెచ్‌సీ పరిధిలో ఎనిమిది హెల్త్ సబ్‌సెంటర్లున్నాయి. నలుగురు రెగ్యులర్ ఏఎన్‌ఎంలు మాత్రమే ఉన్నారు. మరో నలుగురు రెగ్యులర్ ఏఎన్‌ఎంల అవసరం ఉంది. మెయిన్ సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉంది. సీజన్‌కు సరిపడా మందులు ఆస్పత్రికి వచ్చాయి. కుక్క, పాము కాటు మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి వైద్యుడు ట్రెనింగ్‌లో ఉండగా, ఇటీవలే కోటపల్లి నుంచి వైద్యుడు బదిలీపై వచ్చాడు. ఆస్పత్రి సిబ్బంది విధుల్లో ఉన్నారు.

జిల్లా ఆస్పత్రికి జ్వరపీడితులే అధికం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వైరల్ ఫీవర్ బాధితుల సంఖ్య పెరిగింది. నిత్యం 650–700 మంది వస్తుండగా 100 మంది జ్వరపీడితులే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. జ్వరం, మలేరియా, టైఫాయిడ్ బాధితులు వచ్చి చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. సరిపడా మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. చిన్నపిల్లలకు అవసరమ్యే పారాసిటమాల్ ఇంజెక్షన్లు తక్కువగా ఉండగా బయట కొని తెస్తున్నట్లు ఆస్పత్రి ఆర్‌ఎంవో భీష్మ వివరించారు.

హాజీపూర్‌లో మందులు ప్రైవేట్‌లోనే..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు లేరు. దొనబండ, నంనూర్, ముల్కల్ల సబ్ సెంటర్ల ఏఎన్‌ఎంలు బదిలీ కాగా, ఎవరినీ నియమించలేదు. రోగులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. రోజూ ఆస్పత్రికి 80–120 మంది వస్తున్నారు. మందులు లేక ప్రైవేట్‌లో తెచ్చుకోమంటున్నారు.

నస్పూర్ పీహెచ్‌సీలో కొన్ని రకాల టెస్టులే..



నస్పూర్: పేషెంట్‌కు మందులు రాస్తున్న డాక్టర్

నస్పూర్: నస్పూర్ పీహెచ్‌సీ పరిధిలో ఈ సీజన్‌లో నాలుగు డెంగీ కేసులు నమోదైనట్లు పీహెచ్‌సీ అధికారులు తెలిపారు. నిత్యం 90–100 వరకు ఓపీ చుస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు అందరికీ జలుబు, దగ్గుతో కూడిన సాధారణ జ్వరాలున్నట్లు మెడికల్ ఆఫీసర్ సమత తెలిపారు. పీహెచ్‌సీలో డెంగీ, మలేరియా టెస్టులు నిర్వహిస్తుండగా, ఇతర టెస్టుల కోసం శాంపిళ్లు సేకరించి మంచిర్యాల టీ హబ్‌కు పంపిస్తున్నామని పేర్కొన్నారు. రోగుల కోసం నాలుగు సాధారణ బెడ్లు, చిల్డ్రన్స్‌కు రెండు బెడ్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

దండేపల్లి పీహెచ్‌సీలో అరకొర మందులు



దండేపల్లి: పీహెచ్‌సీలో..

దండేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (పీహెచ్‌సీ) లో పూర్తి స్థాయిలో మందులు లేవు. రెండ్రోజుల్లో మందులు పూర్తి స్థాయిలో వస్తాయని పీహెచ్‌సీ వైద్యాధికారి సతీశ్ తెలిపారు. రోజుకు 60 నుంచి 90 మంది రోగులు ఆస్పత్రికి వస్తుంటారని పేర్కొన్నారు. వారం రోజుల్లో 791 మంది రాగా, వీరిలో 68 మందికి సాధారణ జ్వరాలున్నట్లు తెలిపారు. ఇటీవల దండేపల్లికి చెందిన ఓ వ్యక్తికి డెంగీ పాజిటివ్ లక్షణాలున్నట్లు తెలిసింది. పీహెచ్‌సీలో రెగ్యులర్ స్టాఫ్‌నర్స్ లేక కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు షిఫ్ట్‌వైజ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

జన్నారంలో సిబ్బంది, మందుల కొరత



జన్నారం: ఆస్పత్రికి వచ్చిన రోగులు

జన్నారం: మండలంలోని ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బంది, మందుల కొరత ఉంది. మూడు స్టాఫ్‌నర్స్, డాక్టర్, రెగ్యులర్ ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిత్యం 120–150 వరకు ఓపీ ఉన్నట్లు ఇన్‌చార్జి వైద్యురాలు గంగదేవి తెలిపారు. దస్తురాబాద్, కడెం, సారంగపూర్ మండలం కమ్మునూరు, మంగెళ నుంచి కుక్కకాటు, కోతి కాటు బాధితులు ఎక్కువగా వస్తున్నందున యాంటీ రేబిస్ ఇంజక్షన్ల కొరత ఉంది. జ్వరం, దగ్గు, జలుబు మందులు మినహా ఇతర మందులు సరిపడా లేవు. ఆర్డర్ ఇచ్చినా తేవడంలో ఆలస్యమవుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

లక్సెట్టిపేటలో వసతుల కొరత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో విషజ్వరాలతో రోగులు చికిత్స పొందుతున్నారు. రోజుకు 140 ఓపీ కేసులు, 12మంది ఇన్‌పేషెంట్లు ఉంటున్నట్లు సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. డెంగీ, టైఫాయిడ్, చికెన్‌గున్యా వ్యాధులు లేవు. కేవలం వైరల్ ఫీవర్‌తో ఇబ్బంది పడుతున్నారు. పక్కా భవన నిర్మాణ పనులు చేపడుతుండగా ఆస్పత్రి పాత రేకుల షెడ్డులో కొనసాగుతోంది. సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ప్రతీరోజు పరీక్షలు నిర్వహిస్తూ రోగులకు సేవలందిస్తూ మందులు పంపిణీ చేస్తున్నారు.



లక్సెట్టిపేట: ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

బెల్లంపల్లిలో వైరల్ ఫీవర్ బాధితులే అధికం



బెల్లంపల్లి: వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి అర్బన్ హెల్త్‌సెంటర్‌కు పలువురు రోగులు చికిత్స కోసం వచ్చారు. వీరిని డాక్టర్ సౌజన్య పరీక్షించి మాత్రలు అందజేశారు. సిబ్బంది అందుబాటులో ఉన్నారు. హెల్త్ సెంటర్‌కు నిత్యం 80 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తుంటారు. వీరిలో 10–20 మంది జ్వరపీడితులే ఉంటున్నారు. రక్తపరీక్షల్లో సాధారణ వైరల్ ఫీవర్ ఉన్నట్లు నిర్ధారణ అవుతున్నట్లు వైద్యురాలు తెలిపారు. 30–65 ఏళ్లవారికి జ్వరాలు వస్తున్నట్లు నిర్ధారణ అవుతోంది. కొందరిలో దగ్గు, ఆయాసం ఉంటున్నట్లు గుర్తించారు.

జ్వరమచ్చి నాలుగు రోజులైంది



నాలుగు రోజుల నుంచి జ్వరం వస్తుంది. దగ్గు, ఆయాసం ఉన్నది. ఏం తినబుద్ది ఐతలేదు. డాక్టరమ్మ దగ్గరికి ఈరోజే వచ్చిన. పరీక్ష చేసి భయ పడకని చెప్పింది. గోలీలు మూడు దినాలు వరుసగా వేసుకోవాలని సూచించింది. ఏం జెరమో.. ఏమో.. ప్రాణం తాకతీల ఉంట లేదు. మూడు దినాల తర్వాత మళ్లొకసారి వచ్చి పొమ్మన్నది డాక్టరమ్మ.

– సత్తెమ్మ, అంబేద్కర్‌నగర్, బెల్లంపల్లి

తాండూర్‌లో వైద్యుల కొరత



తాండూర్: పీహెచ్‌సీలో రోగులు

తాండూర్: తాండూర్ పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. ముగ్గురు వైద్యులకు ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 1నుంచి మంగళవారం వరకు 502 మంది పీహెచ్‌సీకి రాగా, ఇందులో 36 మంది జ్వర పీడితులే ఉన్నారు. వీరిలో ఇద్దరికి డెంగీ లక్షణాలు బయటపడ్డాయి. మలేరియా, వైరల్ ఫీవర్ పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. మిగతా వ్యాధుల నిర్ధారణకు శాంపిళ్లు సేకరించి మంచిర్యాలకు పంపించి సాయంత్రానికి రిపోర్టులు తెప్పిస్తున్నారు. 24 గంటలు అందుబాటులో ఉండాల్సిన ఆస్పత్రిలో పగటివేళ మాత్రమే సేవలందిస్తున్నారు.

తాళ్లగురిజాల పీహెచ్‌సీలో అరకొర సేవలు



బెల్లంపల్లిరూరల్: పీహెచ్‌సీలో రోగులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని తాళ్లగురిజాల పీహెచ్‌సీలో వైద్యసేవలు అరకొరగా అందుతున్నాయి. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉండగా పూర్థిస్థాయిలో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం లేదు. ఆగస్టు 1 నుంచి మంగళవారం వరకు 310 మంది రాగా, వీరిలో సీజనల్ వ్యాధులు, జలుబు, దగ్గు బాధితులున్నట్లు గుర్తించారు. మలేరియా, వైరల్ ఫీవర్, సీబీపీ పరీక్షలు మాత్రమే పీహెచ్‌సీలో నిర్వహిస్తున్నారు. డెంగీ, టైఫాయిడ్, ఇతర పరీక్షల కోసం శాంపిళ్లు సేకరించి మంచిర్యాల కేంద్రానికి పంపిస్తున్నారు.

నెన్నెలలో పరీక్షల కోసం 'ప్రైవేట్'కు..



నెన్నెల: పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

నెన్నెల: నెన్నెల పీహెచ్‌సీకి రోజుకు 70–80 మంది వస్తుండగా ఇందులో సగం మంది జ్వరపీడితులే ఉంటున్నారు. ఇక్కడ సరిపడా సిబ్బంది లేరు. ల్యాబ్ టెక్నీషియన్ పది రోజుల క్రితం బదిలీపై వెళ్లాడు. రోగులు పరీక్షల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఒక రెగ్యులర్ స్టాఫ్‌నర్స్, రెండు ఎన్‌ఆర్‌హెచ్‌ఎం స్టాఫ్‌నర్స్, ఆఫీస్ సబార్డినేట్, మేల్ సూపర్‌వైజర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక హెల్త్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు.

కిక్కిరిసిపోతున్న చెన్నూర్ సీహెచ్‌సీ



చెన్నూర్: సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

చెన్నూర్: జ్వర పీడితులతో చెన్నూర్ సామాజిక ఆరోగ్యకేంద్రం కిక్కిరిసి పోయింది. ఓపీ కోసం రోగుల బారులు తీరారు. రెండు వార్డుల్లో జ్వర పీడితులు చికిత్స పొందుతున్నారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఆస్పత్రిలో టైఫాయిడ్, సీబీపీ, మలేరియా పరీక్షలు నర్విహిస్తున్నారు. డెంగీ అనుమానితుల రక్తం సేకరించి మంచిర్యాలకు పంపిస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డీ శ్రీధర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజులుగా సీనియర్ అధ్యాపకురాలు రమాదేవి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. ఈమేరకు కొత్తగా బదిలీపై వచ్చిన శ్రీధర్‌కు ఆమె బాధ్యతలు అప్పగించారు.

స్వచ్ఛదనం-పచ్చదనం నిరంతరం కొనసాగించాలి



మాట్లాడుతున్న సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషలాఫీసర్, సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ శ్రీపాద రామేశ్వర్ సూచించారు. మంగళవారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజారోగ్యానికి దోహదపడే కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది భాగస్వాములు కావాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జయశంకర్ సేవలు చిరస్మరణీయం



చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్



గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్..

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర సాధనలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు.. నినాదంతో తెలంగాణ సాధనే లక్ష్యంగా పోరాటం సాగించారని పేర్కొన్నారు. స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా నిర్విరామ కృషి చేశారని కొనియాడారు. వివిధ శాఖల అధికారులున్నారు.

గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకటరాములు జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్ఐలు రవి, కుమారస్వామి, శ్రీనివాస్, శ్యామ్, గోపి, మారుతి, సురేశ్, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది, శిక్షణ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరమని, పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త రజితతో కలిసి తల్లిపాల ఆవశ్యకతపై వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతీ సంవత్సరం ఆగస్టు 1నుంచి 7వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. బాలల పరిరక్షణ సమితి అధికారి ఆనంద్, సీడీపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులు పరిష్కరించాలి

- షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్



మాట్లాడుతున్న వడ్డేపల్లి రాంచందర్

మంచిర్యాలఅగ్రికల్చర్: అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం, ఆర్థికసాయం అందేలా చూడాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సంచాలకుడు సునీల్‌కుమార్ బాబు, రీసెర్చ్ అధికారి వరప్రసాద్, కలెక్టర్ కుమార్‌దీపక్, ఎస్సీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు రేణిగుంట్ల ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. జిల్లాలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి అందుతోందని తెలిపారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద జిల్లాకు 30 యూనిట్లు కేటాయించగా ఇందులో 12 ఎస్సీలకు మంజూరు చేసినట్లు చెప్పారు. పెండింగ్ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలని, చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. సివిల్స్ రైట్స్‌డే సమావేశాలకు సంబంధిత అధికారులు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీల అభివృద్ధికి సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు జిల్లపెల్లి వెంకటేశ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యాప్రవేశ్ సర్వే

- జిల్లాలోని రెండు పాఠశాలల్లో ఎఫ్‌ఐల క్షేత్రస్థాయి పరిశీలన
- ఒకటో తరగతి విద్యార్థుల సామర్థ్యాలపై మదింపు



గూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

మంచిర్యాలఅర్బన్: ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందిన విద్యార్థుల పాఠశాల సంసిద్ధత ఫలితాలపై స్వల్పకాలిక ప్రభావాన్ని అంచనా వేసేందుకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నారు. స్కూల్ ప్రిపరేషన్ మాడ్యుల్ (ఎస్పీఎం) – విద్యాప్రవేశ్ పేరిట మదింపు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 జిల్లాల్లో ఈ ప్రక్రియ నిర్వహిస్తుండగా జిల్లాలో రెండు ప్రాథమిక పాఠశాలలను గుర్తించారు. దండేపల్లి మండలంలోని గూడెం, పెద్దపేట్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను తేల్చనున్నారు. బుధ, గురువారాల్లో కార్యక్రమం నిర్వహించనున్నారు. పాఠశాల ప్రారంభ గంటనుంచి ఇంటి గంట కొట్టే వరకు ఎస్సీఈఆర్టీ ప్రతినిధి పాఠశాలల్లో ఉంటూ నిరంతర పరిశీలన చేయనున్నారు. ఈ ప్రతినిధులకు సహాయకులుగా ఇద్దరు లేదా ముగ్గురు సీనియర్ ఉపాధ్యాయులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఉంటారు. ఇందులో కల్పన (గుడిరేవు), శ్రీనివాస్ (వెల్గనూర్)కు చెందిన ఉపాధ్యాయులు ఎఫ్‌ఐలుగా వ్యవహరించనున్నారు.

పరిశీలన ఇలా..

విద్యార్థుల సామర్థ్యాల అంచనాకు ఎస్‌సీఈఆర్టీ తొమ్మిది టూల్స్ రూపొందించింది. మూడు ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా నిర్వహించనుండగా, మిగతా ఆరు క్షేత్ర పరిశోధనలు ఎఫ్‌ఐలు నిర్వహిస్తారు. పాఠశాల ప్రారంభ సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, తరగతి నిర్వహణ, పాఠశాల పరిశుభ్రత, బోధనలో ఉపాధ్యాయుల పనితీరు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. మధ్యాహ్న భోజనం వంట, వడ్డన, భోజనం చేసే తీరుతెన్నులను పరిశీలించి ఎస్సీఈఆర్టీ ప్రతినిధి సీల్డ్ కవర్‌లో వీటిని కేంద్రానికి పంపిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పాఠశాలలో బోధన తదితర విషయాలపై అభిప్రాయ సేకరణ ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య తెలిపారు.

డీఐఈవోగా అంజయ్య



మంచిర్యాలఅర్బన్: జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా (డీఐఈవో) అంజయ్యను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ డీఐఈవోగా విధులు నిర్వహించిన శైలజ ధర్మపురికి బదిలీ అయ్యారు. గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయిన అంజయ్యను డీఐఈవోగా (ఫుల్ ఆడిషనల్ చార్జి)ఎఫ్‌ఏసీ)గా నియమించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

క్లుప్తంగా

తెలంగాణ జాతిపిత జయశంకర్



నివాళులర్పిస్తున్న జీఎం, అధికారులు

శ్రీరాంపూర్: తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం జయశంకర్ జయంతిని పురస్కరించుకుని జీఎం కార్యాలయం వద్ద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు దారిచూపిన మహనీయుడు జయశంకర్ సార్ అన్నారు. ఆయన తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచి రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఇతర డీజీఎంలు చిరంజీవి, ఆనంద్ కుమార్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, అకౌంట్స్ అధికారి పద్మ, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

జైపూర్: 1200 మెగా వాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో గల యూనిట్–2 క్యాపిటల్ ఓవర్ హాలింగ్ పనులు త్వరగా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం ఎస్టీపీపీని సందర్శించారు. ఈ సందర్భంగా అడ్మిన్ భవన కార్యాలయంలో ఓఅండ్ఎం చీఫ్ జెన్సింగ్, జీఎం శ్రీనివాసులుతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పవర్ ప్లాంటులో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు.

మాజీ సైనికుడిపై కేసు నమోదు

నస్పూర్: పట్టణ పరిధిలోని ఓ ప్రభుత్వ భూమికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన మాజీ సైనికుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సీసీసీకి చెందిన మాజీ సైనికుడు ముదమల్ల రమేశ్ నస్పూర్ శివారులోని సర్వే నంబర్ 119లోని ఐదెకరాల ప్రభుత్వ భూమి తనదని ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి అధికారులను తప్పుదోవ పట్టించేందుకు యత్నించాడన్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు రమేశ్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

జైపూర్: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం షెట్‌పల్లి గ్రామానికి చెందిన రేవెల్లి శ్రీకాంత్ మంగళవారం ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వెళ్తుండగా టేకుమట్లలో రోడ్డుపై ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో గమనించిన స్థానికులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రైతువేదికలో చోరీపై ఫిర్యాదు

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో సోమవారం చోరీ జరిగినట్లు ఏఈవో శ్రీలత మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల రైతుల కోసం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించే పరికరాలు మంజూరయ్యాయని, బ్యాటరీ, సంబంధిత వస్తువులు చోరీకి గురికాగా టెలికాన్ఫరెన్స్ పరికరాలు ధ్వంసమైనట్లు ఆమె తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో చోరీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించారు.

క్రీడలకు మహర్దశ..!



బాక్సింగ్ సాధన చేస్తున్న క్రీడాకారులు

'ప్రస్తుతం తల్లిదండ్రులు విద్యార్థులను చదువులపైనే ఎక్కువ సమయం కేటాయింపజేస్తూ ఒత్తిడికి కారణం అవుతున్నారు. దీంతో పిల్లలు క్రీడా అంశాలకు దూరమవుతున్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలతో పాటు గౌరవం సైతం లభిస్తుంది. ఈ దిశగా విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించే విధంగా రాష్ట్రంలో నూతనంగా స్పోర్ట్స్ పాలసీ తీసుకురావాలని భావిస్తున్నాం. క్రీడా మైదానాల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రత్యేక నిధులను కేటాయించడమే కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి దీనికి అనుగుణంగా ముందుకెళ్తాం. క్రీడలను అభివృద్ధి చేయాలన్న ధ్యేయంతో ఇప్పటికే రూ.361 కోట్లు కేటాయించాం.' అంటూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు.



జావెలిన్ విసురుతున్న క్రీడాకారిణి



అథ్లెటిక్స్ సాధన చేస్తున్న అథ్లెట్

- స్పోర్ట్స్ పాలసీ దిశగా ప్రభుత్వం కసరత్తు
- క్రీడా వసతులు మెరుగుపడే అవకాశం
- సౌకర్యాలు కల్పిస్తే రాణిస్తామంటున్న క్రీడాకారులు



జూడో ఆడుతున్న జూడోకాలు

ఆదిలాబాద్: రాష్ట్రంలో నూతనంగా క్రీడా పాలసీ తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. క్రీడా విధానం తీసుకువస్తే రాష్ట్రంలో క్రీడా రంగం ఎంతగానో అభివృద్ధి చెందనుంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలు, నగరాల వరకు ఎన్నో క్రీడా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులు వెలుగులోకి రావడానికి అవకాశాలు మెరుగుపడనున్నాయి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించేలా క్రీడాకారులకు తర్ఫీదు లభించనుంది. గొప్పగా రాణించే క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో క్రీడా పాలసీ తీసుకొస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడా శాఖను తన వద్దే అట్టిపెట్టుకున్న ఆయన ఇందుకు అనుగుణంగా విధివిధానాలు రూపొందించనున్నామని అసెంబ్లీ సమావేశాల్లో తెలియజేశారు. నూతన స్పోర్ట్స్ పాలసీ అమల్లోకి వస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని శిక్షకులు, క్రీడాకారులు, యువతలో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పెద్ద ఎత్తున నిధులు

రాష్ట్రంలో నూతన క్రీడా విధానం అమలులోకి వస్తే క్రీడారంగానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుంది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రాథమిక పాఠశాల దశ నుంచి క్రీడలపై ఆసక్తి కలిగేలా పాఠశాల మైదానాలు ఏర్పాటు చేయడం, జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో స్పోర్ట్స్ అకాడమీలు, మినీ స్టేడియాల నిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది. ఆయా స్టేడియాలు, అకాడమీలలో అన్ని క్రీడలు ఆడేలా క్రీడా సదుపాయాల కల్పన, ఆట పరికరాలు, శిక్షకుల నియామకం వంటివాటిపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. ప్రతీ సంవత్సరం పాఠశాల, కళాశాల, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు జరిగి ప్రతిభగల క్రీడాకారులు ఎందరో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటేలా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని క్రీడా నిపుణులు పేర్కొంటున్నారు.

అందుబాటులోకి వస్తే రాణిస్తాం

ప్రభుత్వం క్రీడా పాలసీని ప్రకటిస్తే ప్రస్తుతం ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించి అధునాతన సౌకర్యాలు తీసుకురావాలని క్రీడాకారులు శిక్షకులు భావిస్తున్నారు. దీనివల్ల రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పతకాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం..

ఎంతోమంది క్రీడలపై ఆసక్తి ఉన్నప్పటికీ అరకొర పాఠశాల మైదానాలు, వసతుల లేమితో ఉన్న స్టేడియాల్లో సరైన సాధన చేయలేక నైపుణ్యమైన శిక్షణను పొందలేక క్రీడల్లో వెనుకబడిపోతున్నారు. క్రీడా రంగాన్ని ఎంచుకున్న విద్యార్థులు, యువత ఉపాధి అవకాశాలు లేకుండా నిరుద్యోగులుగా మిగిలి పోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. అయితే నూతన క్రీడా పాలసీ అమలులోకి వస్తే నైపుణ్యం గల క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. వారి యొక్క టాలెంట్ అనుసరించి గొప్ప అవకాశాలు కల్పించడమే కాకుండా, పెద్ద ఎత్తున నగదు ప్రోత్సాహకాలు సైతం అందించే వీలు కలుగుతుంది. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటితే ప్రభుత్వ ఉద్యోగాలు సైతం లభించే ఆస్కారం ఉంది. పెన్షన్, బీమా వంటి అదనపు సౌకర్యాలు సైతం కల్పించే వీలుంది. ఈ విధంగా విద్యార్థి దశ నుంచి క్రీడలపై అభిరుచి కల్పించి, ఖేలో ఇండియా, ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్, ఒలంపిక్స్ వంటి విశ్వ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించేలా సత్తా గల క్రీడాకారులను రూపొందించడమే లక్ష్యంగా క్రీడా పాలసీ ఉండాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలి



క్రీడా విధానం పకడ్బందీగా అమలు చేస్తే క్రీడారంగంలో గణనీయమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. నైపుణ్యం గల క్రీడాకారులు తయారై పెద్ద సంఖ్యలో పతకాలు సాధించే అవకాశం ఉంటుంది. క్రీడా సామర్థ్యలను పెంపొందించుకోవడానికి అధునాతన క్రీడా సౌకర్యాలు, సామగ్రి ఉంటే బలమైన పోటీదారులుగా తయారవుతారు. క్రీడా పాలసీ ప్రవేశపెట్టి ప్రణాళికాబద్ధంగా కట్టుదిట్టంగా అమలు చేస్తే గొప్ప భవిష్యత్తు గల క్రీడాకారులు ఒలింపిక్స్ పోటీల్లోనూ ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది.

– రాజు, జూడో కోచ్, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తాం



ప్రస్తుతం ఉన్న శిక్షకుల సహాయంతో మంచి శిక్షణ పొందుతున్నాం. స్పోర్ట్స్ పాలసీ వస్తే ఆటను మెరుగుపర్చుకోవచ్చు. నైపుణ్యాలు పెరిగితే ఆటలో రాణించే అవకాశం ఉంటుంది. ఉన్నత విద్యావకాశాలతో పాటు, ఉద్యోగ అవకాశాలు కూడా లభ్యమైతే ఆసక్తిగల క్రీడాకారులు ముందుకు వస్తారు. జూడోకు సంబంధించి ప్రత్యేకమైన హాల్ కేటాయించాలి. అన్ని క్రీడా పరికరాలు ఉంటే, నిరంతరం సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణిస్తాం.

– హర్షవర్ధన్, జూడో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి, ఆదిలాబాద్

ఇండోర్ స్టేడియం నిర్మించాలి



ప్రస్తుతం బ్యాడ్మింటన్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ పొందిన క్రీడ. మన రాష్ట్రం నుంచే పీవీ సింధు, సైనా నెహ్వాల్, శ్రీకాంత్, కశ్యప్ లాంటి వారు అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటారు. అయితే వారు అన్ని సౌకర్యాలు ఉన్న శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందారు. రాకెట్స్, స్పెషల్ స్పోర్ట్స్ కిట్స్, అన్ని వసతులు గల ఇండోర్ స్టేడియం వంటివి అందుబాటులోకి వస్తే రాణించగలుగుతాం.

– ఐశ్వర్య, బ్యాడ్మింటన్, స్పోర్ట్స్ స్కూల్, ఆదిలాబాద్

అన్నీ సమకూర్చాలి..



బాక్సింగ్ క్రీడలో ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. దానికి తగినట్టు డైట్ నాణ్యంగా అందజేస్తే ఎక్కువ సేపు బాక్సింగ్ రింగ్‌లో పోరాడగలుగుతాం. క్రీడలో అత్యవసరమైన పంచింగ్ బ్యాగ్స్, గ్లౌజెస్, రింగ్ డ్రెస్ (కార్నర్స్) వంటివి సమకూర్చాలి. అవి చాలా ఖరీదైనవి. వాటిని సమకూర్చితే మెరుగ్గా రాణించే అవకాశం ఉంటుంది. ఇవి అందుబాటులో లేకపోవడంతో బాక్సర్లు సరైన సాధన చేయలేకపోతున్నారు.

– నిహారిక, బాక్సింగ్, స్పోర్ట్స్ స్కూల్, ఆదిలాబాద్

ప్రతీ ఉద్యోగి లక్ష్యసాధనకు కృషి చేయాలి



కాసిపేట 2గనిపై జీఎం మనోహర్

కాసిపేట: ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యసాధనకు తమవంతు కృషి చేయాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ సూచించారు. మంగళవారం కాసిపేట 2గనిని సందర్శించి పనిస్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలన్నారు. గని జియోలాజికల్ పరిస్థితుల దృష్ట్యా భద్రత, ఉత్పాదకతను మెరుగుపర్చేందుకు ట్రాక్‌లైన్‌లు, జంక్షన్‌ల అభివృద్ధికి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, గ్రూప్ ఇంజనీర్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నవ జాత శిశువు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నవజాత (మగ) శిశువు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామానికి చెందిన గడికొప్పుల శ్రీలత–సురేష్‌కు 2022లో వివాహమైంది. ఈ నెల 3న శ్రీలతను ప్రసవంకోసం ఆస్పత్రికి తీసుకురావడంతో మగ శిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన శిశువు ఉమ్మనీరు మింగడంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండడంతో వెంటనే స్థానిక ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స నిర్వహించిన వైద్యులు ఈనెల 5న డిశ్చార్జ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు బాగానే ఉన్న శిశువు సాయంత్రం మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యంతోనేనని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. శిశువుకు పాలు పట్టించిన తర్వాత పడుకోబెట్టడంతో పాలు శ్వాసనాలాల్లోకి వెళ్లి శ్వాస ఆగిపోవడంతో మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.

మందమర్రి ఏరియా జీఎం బదిలీ



నూతన జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జీఎం మనోహర్ ఎన్విరాన్‌మెంట్ (కార్పొరేట్)కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మార్కెటింగ్ (హైదరాబాద్) జీఎం దేవేందర్‌ను మందమర్రి ఏరియాకు బదిలీ చేస్తూ మంగళవారం జీఎం పర్సనల్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గత ఆగస్టులో బదిలీపై వచ్చిన మనోహర్ ఏడాది వ్యవధిలోనే బదిలీపై వెళ్తున్నారు.

ప్రజల హృదయాల్లో గద్దర్‌కు సుస్థిరస్థానం



అంజలి ఘటిస్తున్న దళిత, ప్రజాసంఘాలు

బెల్లంపల్లి: ప్రజాకవి, గాయకుడు గద్దర్ పీడిత ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నాడని దళిత, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో గద్దర్, జాహిర్ అలీఖాన్ ప్రథమ వర్ధంతి, చుండూరు మృతవీరుల 33వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల గాథలను పాటలుగా ఎంచుకుని గద్దర్ జనం గొంతుకయ్యారని అన్నారు. పీడిత, తాడిత, అట్టడుగు వర్గాల ప్రజల పక్షాన పాలక ప్రభుత్వాల తీరుపై గొంతెత్తి గర్జించారన్నారు. అంతకు ముందు కాంటా చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక నాయకుడు గొడిసెల శ్రీహరి, భారత నాస్తిక సమాజం నాయకుడు జీఏ జ్యోతికుమార్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎల్తూరి శంకర్, ఎంహెచ్‌డీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనర్సు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎం.చిన్నరాజం, ఎమ్మార్పీఎస్ నాయకుడు రత్నం ఐలయ్య, మాల మహానాడు జాతీయ కార్యదర్శి యాదగిరి, జిల్లా అధ్యక్షుడు రాజేశ్, ఎంహెచ్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దండేపల్లి: ఈ నెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని లింగాపూర్‌కు చెందిన దావుల రంగాజీ (34) ఆదివారం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పొగాకు ఉత్పత్తుల స్వాధీనం

వేమనపల్లి: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపంలోని బైక్ మెకానిక్ లింగేష్ దుకాణంలో మంగళవారం పొగాకు ఉత్పత్తులు పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల దూరం లోపల పొగాకు ఉత్పత్తులు, గంజాయిలాంటి విక్రయాలు చేస్తే సెక్షన్–6 కోకా యాక్ట్, 77, 78 జువైనల్ జస్టిస్ యాక్టు ప్రకారం నేరమన్నారు. 20 మీటర్ల దూరంలో లింగేష్ మెకానిక్ షాపులో అంబర్, విమల్ ప్యాకెట్లతో పాటు బీడీ, సిగరేట్లు లభ్యమయ్యాయన్నారు. నిందితుడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లభ్యం కాని యువకుడి ఆచూకీ

తిర్యాణి: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన రుషి ఆదిత్య సోమవారం మండలంలోని గుండాల జలపాతంలో గల్లంతైన విషయం తెలిసిందే. మంగళవారం ఎస్సై చుంచు రమేశ్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకూ ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలను నిలిపి వేశారు. బుధవారం ఉదయం నుంచి మళ్లీ గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓబీ టిప్పర్ల బోల్తా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు ఓబీ కుప్పపై వోల్వో టిప్పర్లు బోల్తా పడ్డాయి. సోమవారం రాత్రి షిఫ్ట్‌లో ఒకటి, మంగళవారం సెకండ్ షిఫ్ట్‌లో రెండు టిప్పర్లు బోల్తా పడ్డాయి. ఓబీ మట్టిని డంప్‌యార్డుపై అన్‌లోడ్ చేసే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడ్డాయి. అప్రమత్తమైన డ్రైవర్లకు బయటకు దూకడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. వర్షాలకు మట్టి దిగబడడంతో జాక్ బ్యాలెన్స్ తప్పి ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. మట్టి పూర్తిగా ఆరకముందే వాహనాలు నడపడంతో నానిన మట్టికి టిప్పర్లు కుంగిపోయి అన్‌లోడింగ్ సమయంలో పడిపోయాయని డ్రైవర్లు పేర్కొంటున్నారు. ఇలా రక్షణ, జాగ్రత్తలు తీసుకోకుండా వాహనాలు నడిపించడం వల్ల తమకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన రాగంశెట్టి రాములు (46) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుని అల్లుడు కొట్టె సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

నెన్నెల: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన కుమ్మరి పోశన్నపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 49లో హైదరాబాద్‌కు చెందిన బోడపాటి సేజల్‌కు ఐదు గుంటల భూమి ఉందని, అట్టి స్థలంలో పోశన్న హద్దు రాళ్లను తొలగించి ఆక్రమించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. భూమి వద్దకు వెళ్లిన సేజల్‌ను తన అనుచరులతో కలిసి చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడన్నారు. తన జోలికి వస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టిస్తానంటూ బెదిరిస్తున్నాడని సేజల్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్లాస్టిక్ రహిత టైగర్ జోన్ చేద్దాం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌ను ప్లాస్టిక్ రహితం చేద్దామని తాళ్లపేట్, ఇందన్‌పల్లి రేంజ్ అధికారులు సుష్మారావు, హఫీజోద్దీన్ అన్నారు. మంగళవారం జన్నారం అటవీ డివిజన్‌లోని పలు రేంజ్ పరిధిలో ప్లాస్టిక్ నిరోధం, ప్లాస్టిక్‌తో జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈనెల 7న అటవీశాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వోలు తిరుపతి, పోచమల్లు, హేమలత, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

పులి దాడిలో ఆవు మృతి

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు కాలనీ సమీపంలో మంగళవారం పులి దాడిలో ఆవు మృతిచెందింది. సోమవారం గోవింద్‌పూర్ పరిసర ప్రాంతాల్లో పులి అడుగులను అధికారులు గుర్తించారు. అంకుసాపూర్ వైపు వెళ్లిందని భావించినప్పటికీ పెద్దవాగు దాటి ఎర్రగుట్ట వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆవుపై పులి దాడి విషయం తెలియగానే ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్‌సింగ్ సర్దార్, రెబ్బెన ఇన్చార్జి రేంజ్ అధికారి శ్రీధరచారి, ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, సిబ్బంది అనిమల్ ట్రాకర్‌పై సంఘటన స్థలానికి వెళ్లి అక్కడ కెమెరాలు అమర్చారు. ఆవు యజమాని డోంగర్‌గూడకు చెందిన కొట్నాక నాందేవ్‌కు రూ.5వేలు తక్షణ సహాయంగా అందజేశారు. అధికారులు సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రిపూట ఆయా ప్రాంతాల్లో తిరగొద్దని సూచించారు.

ఢిల్లీలో స్వాతంత్య్ర వేడుకలకు ఆహ్వానం



ప్రిన్సిపాల్‌తో విద్యార్థిని దర్శిని బజాజ్

చెన్నూర్: ఢిల్లీలోని ఎర్రకోటలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని చెన్నూర్ చిన్నముణ్ని పబ్లిక్ స్కూల్‌కు చెందిన దర్శిని బజాజ్, జన్నారం మండలానికి చెందిన రాంటెంకి విష్ణువర్ధన్‌కు ఆహ్వానం అందినట్లు ప్రిన్సిపాల్ త్రిష్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ప్రేరణ కార్యక్రమంలో రాష్ట్రం తరపున ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు ఎస్కార్ట్ టీచర్‌గా నయ్యర్ భాను పాల్గొంటారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న పవర్‌ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: పాతమంచిర్యాల శివారులోని శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నస్పూర్‌లోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో మంగళవారం జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు రావాల్సిన ప్లాంట్ క్లోజింగ్ బెనిఫిట్‌లు ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. స్పందించిన రాంచందర్ కార్మికులకు న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్, కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

13 టీఎంసీలకు 'ఎల్లంపల్లి' నీటిమట్టం



తగ్గుతున్న నీటిమట్టంతో ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద గల ఎల్లంపల్లి (శ్రీపాదసాగర్) ప్రాజెక్ట్ నీటిమట్టం 13.3 టీఎంసీలకు పడిపోయింది. వర్షాలు లేకపోవడం, ఎగువ ప్రాంతాల నుంచి వరద నిలిచిపోవడంతో పాటు ప్రాజెక్ట్‌లోని నీటిని నంది పంప్‌హౌజ్‌కు తరలిస్తుండటంతో నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. మంగళవారం ప్రాజెక్ట్ నీటి మట్టం తాజా వివరాలు ఇలా ఉన్నాయి. ప్రాజెక్ట్ నీటి మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా 145.50 మీటర్లకు చేరగా 20.175 టీఎంసీలకు గాను 13.910 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో కింద 5 క్యూసెక్కుల నీరు వస్తుండగా అవుట్ ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వార్క్స్ పథకానికి 304 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులతో పాటు నంది పంప్‌హౌజ్‌కు 6,500ల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. దీంతో ఐదు రోజుల్లో ఏకంగా ఐదు టీఎంసీల నీటి మట్టానికి పడిపోయింది.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

చెన్నూర్: మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తూ పంచాయతీలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. సమావేశంలో వడ్లకొండ పర్వతాలు, తగరం అశోక్, ప్రశాంత్, శ్యామ్, శ్రావణ్, పోచం, మల్లేశ్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

సీఐలకు ప్రశంసాపత్రాలు

మంచిర్యాలక్రైం: రామగుండం కమిషనరేట్ పరిధిలో ముగ్గురు సీఐలు హత్యల కేసుల్లో నిందితులకు జీవితఖైదు పడేలా కృషి చేసినందుకు గాను రాష్ట్ర డీజీపీ జితేందర్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో మంగళవారం ప్రశంసాపత్రాలు అందుకున్నారు. గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్‌కుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, శ్రీరాంపూర్ సీఐ డీ.మోహన్ గతంలో పని చేసిన పోలీస్‌స్టేషన్ల పరిధిలో తక్కువ కేసు విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చూశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన సీఐలను సీపీ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్ అభినందించారు.







డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐలు అశోక్‌కుమార్, మోహన్, శశిధర్‌రెడ్డి